క్లుప్తంగా

క్రైస్తవుల శాంతి ర్యాలీ



హుస్నాబాద్: మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న హింసాకాండ, లైంగికదాడులకు నిరసనగా శనివారం హుస్నాబాద్ డివిజన్ స్థాయి పాస్టర్స్, ఫెల్లోషిప్, క్రైస్తవుల ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో శాంతి ర్యాలీ, నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఫాస్టర్ నవీన్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్మన్ అయిలేని అనిత, ఫాస్టర్లు, క్రైస్తవులు పాల్గొన్నారు.

ఎస్‌ఐగా చంద్రమోహన్ బాధ్యతల స్వీకరణ

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఎస్‌ఐగా చంద్రమోహన్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన ఎస్‌ఐ కృష్ణమూర్తికి సీఐగా పదోన్నతిపై వెళ్లారు. కొమురవెల్లి ఎస్‌ఐ జగదేవ్‌పూర్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అధిక వర్షాల వల్ల గ్రామాల్లో చెరువు, కుంటలు నిండుకుండులా మారాయని, అటు వైపు యువకులు, విద్యార్థులు వెళ్ల వద్దని సూచించారు.

ప్రముఖుల పరామర్శ



మాజీ సర్పంచ్ కుటుంబీకులను పరామర్శిస్తున్న వినోద్‌కుమార్, ఎమ్మెల్యే సతీష్‌కుమార్

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలం కట్కూర్ గ్రామ మాజీ సర్పంచ్, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు బడుగు రాంచందర్ తల్లి ఈశ్వరమ్మ ఇటీవల మృతిచెందింది. శనివారం రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బీ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ మాలోతు లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు భూక్య మంగ, హనుమకొండ జిల్లా జెడ్పీ చైర్మన్ మారంపెల్లి సుదీర్‌బాబు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వాహనచోదకులు హెల్మెట్ ధరించాలి



హెల్మెట్లు పంపిణీ చేస్తున్న రజనీకాంత్‌రెడ్డి

దుబ్బాక: వాహనచోదకులు బాధ్యతగా హెల్మెట్ ధరించాలని దుబ్బాక సీఐ మున్నూరు కృష్ణ అన్నారు. శనివారం కేఆర్‌ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కోమటిరెడ్డి రజనీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బందికి హెల్మెట్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలు తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. కేఆర్‌ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రజనీకాంత్ రెడ్డి మండలంలో గ్రామాలవారీగా వాహనదారులకు హెల్మెట్లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ బత్తుల మహేందర్, ఎస్సై గంగరాజు, సర్పంచ్ దేవి రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు రాజమౌళి పంతులు, కూర వేణు తదితరులున్నారు.

వరద బాధితులను ఆదుకోవాలి

హుస్నాబాద్: అధికారుల నిర్లక్ష్యం, పాలకులు పట్టించుకోకపోవడంతోనే ఇళ్లల్లోకి, దుకాణాల్లోకి వరద చేరి తీవ్రంగా నష్టపోయారని, బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు గడిపె మల్లేశ్ డిమాండ్ చేశాడు. శనివారం పట్టణంలో భారీ వర్షాలకు దెబ్బతిని కూలిపోయిన ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మల్లేశ్ మాట్లాడుతూ, వర్షాకాలం రాక ముందే నాలాలు, డ్రైనేజీలు శుభ్రం చేయకుండా నిర్లక్ష్యం చేశారన్నారు. వరదల్లో నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేలు, దుకాణదారులకు రూ.50 వేలు, ఇళ్లు కూలిపోయిన బాధిత కుటుంబాలకు రూ.లక్ష నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంజీవరెడ్డి, సుదర్శనచారి పాల్గొన్నారు.

బీజేపీ సంబరాలు

హుస్నాబాద్: బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా బండి సంజయ్ నియమితులైన సందర్భంగా పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తంచేశాయి. శనివారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో నాయకులు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కోశాధికారి దొడ్డి శ్రీనివాస్, పార్టీ అసెంబ్లీ కో కన్వీనర్ వేణు గోపాల్ రావు, పట్టణ అధ్యక్షుడు శంకర్‌బాబు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ద్వారా వాగు దాటించి..

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని ఈదుల ఒర్రె కల్వర్టు శనివారం ఉధృతంగా ప్రవహిస్తోంది. అక్కడికి చేరుకున్న ప్రయాణికులకు దానిని దాటేందుకు ఇబ్బంది పడ్డారు. గమనించిన సర్పంచ్ టీకు తిరుపతి.. ట్రాక్టర్ ద్వారా ప్రయాణికులను దాటించారు. సర్పంచ్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

వర్షం తెచ్చిన నష్టం



ఇసుక మేటలు, రాళ్లు, మొరంతో కమ్మేసిన వరిపొలం

కోల కనకరాజు, రైతు, ధర్మారం

అక్కన్నపేట(హుస్నాబాద్): ఈ ఫొటో కనిపిస్తున్న రైతు పేరు కోల కనకరాజు. తనది అక్కన్నపేట మండలం ధర్మారం. తనకున్న 3 ఎకరాల్లో వరినాట్లు వేశాడు. భారీ వర్షాలకు పొలంతా ఇసుక మేటలు, రాళ్లు, మొరంతో పూర్తిగా నిండిపోయింది. సాగుకు సుమారుగా రూ.70 నుంచి 80 వేల వరకు ఖర్చయినట్లు చెబుతున్నాడు. అయితే ఇక్కడ ధర్మారం–మసిరెడ్డితండా గ్రామానికి వెళ్లే మార్గ మధ్య తాటివనంలో ఇటీవల బ్రిడ్జిని నిర్మించారు. సదరు కాంట్రాక్టర్ చేసిన తప్పుల వల్లే తన వరిపొలంతా ఇసుక మేటలు, రాళ్లు, మొరంతో నిండి నష్టం జరిగిందని రైతు కనకరాజు ఆరోపిస్తున్నాడు.

ఉధృతిగానే ఎల్లమ్మ చెరువు




ఎల్లమ్మ చెరువు మత్తడి ప్రవాహం



హుస్నాబాద్: ఎల్లమ్మ చెరువు శనివారం కూడా ఉధృతంగా ప్రవహిస్తోంది. హుస్నాబాద్, రామవరం రహదారిపై రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. వరద తాకిడికి రహదారి కోతకు గురికావడంతో పోలీసులు రాకపోకలను నిలిపేశారు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

నాణ్యత లోపం.. కూలిన బ్రిడ్జి



జగదేవ్‌పూర్(గజ్వేల్): కాళేశ్వరం కాల్వ 15వ ఫేజ్ కింద మండలంలోని నిర్మించిన కాల్వ పనుల్లో నాణ్యతలోపం బయటపడింది. మండలంలోని తిగుల్ గ్రామ సమీపంలో కాల్వపై వర్షం నీరు వెళ్లడానికి బ్రిడ్జి నిర్మించారు. తాజాగా కురిసిన వర్షాలకు ఒక వైపు గండి పడి కూలింది. ఆపై బీములు కుంగాయి. ఇటీవల ప్లాస్టింగ్ పనులు చేయగా పెచ్చులూడాయి. ఈ విషయంపై డీఈ రూప్‌సింగ్‌ను వివరణ కోరగా, బ్రిడ్జికి వెంటనే మరమ్మతులు చేస్తామన్నారు.

హరిత హారానికి గొడ్డలి పోటు





మున్సిపల్ కార్యాలయం ఎదుట చెట్ల నరికివేత

హుస్నాబాద్: పట్టణంలో మున్సిపల్ అధికారులు హరితహారంలో భాగంగా మొక్కలు నాటారు. మరో వైపు విద్యుత్ అధికారులు పెరిగిన చెట్లను ఉన్నపళంగా నరికివేస్తున్నారు. మున్సిపల్ శాఖాధికారులకు, విద్యుత్ అధికారులకు మధ్య సమన్వయం లేకపోవడంతో చెట్లు నరికివేతకు గురవుతున్నాయి. మున్సిపల్ అధికారులు విద్యుత్ తీగల కిందనే మొక్కలు నాటగా, అవి విద్యుత్ వాటిని తాకుతూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగిస్తున్నాయని కరెంట్ అధికారులు పెరిగిన మొక్కలను నరికివేస్తున్నారు. ఇకనైనా మున్సిపల్ అధికారులు మొక్కలు నాటే ముందు విద్యుత్ తీగలకు వెలుపల నాటితే నరికివేతలు ఉండవని, దీంతో పెంపక ఉద్దేశం కూడా నెరవేరుతుందని స్థానికులు పేర్కొంటున్నారు.

వ్యర్థాలు తగ్గించుకోవాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత



పాత దుస్తులను కేంద్రానికి అందజేస్తున్న కాలనీ వాసులు

హుస్నాబాద్: చెత్త తగ్గాలంటే మళ్లీ మళ్లీ వాడుకోగల వస్తువులకే అధిక ప్రాధాన్యత ఇవ్వాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అన్నారు. శనివారం పట్టణంలోని 20వ వార్డులో తిపుల్‌ఆర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ ఆకుల రజిత మాట్లాడుతూ, చెత్త కుప్పల్లో చేరే వ్యర్థాలను తగ్గించుకోవాలన్నారు. వాడేసిన ప్లాస్టిక్ రీ సైకిల్ చేయడం ద్వారా కొంత ఉత్పత్తి తగ్గుతోందని, చెడిపోయిన ఆహార పదార్థాలు సేంద్రీయ ఎరువుల తయారీకి ఉపయోగించవచ్చన్నారు. ఉపయోగపడని ఎలక్ట్రానిక్ వస్తువులు, ఇనుప వస్తువులు, పుస్తకాలు, ప్లాస్టిక్ వస్తువులు, దుస్తులు తదితర వస్తువులను సేకరణ కేంద్రానికి అందజేయాలని కోరారు. పర్యావరణ పరిరక్షణలో అందరు భాగస్వాములై హుస్నాబాద్ పట్టణాన్ని పరిశుభ్ర పట్టణంగా తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ అయిలేని అనిత, కౌన్సిలర్లు వాల సుప్రజ, హరీష్, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణతో మహిళలకు ఉపాధి

బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ



శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్న దృశ్యం

చిన్నకోడూరు(సిద్దిపేట): కుట్టుశిక్షణతో మహిళలకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ అన్నారు. శనివారం ఎల్లాయపల్లి, చెలుకలపల్లి, చంద్లాపూర్‌ల్లో ఉచిత కుట్టు శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 30 రోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తారని, ఈ సమయంలో మధ్యాహ్నం భోజన వసతి కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ మాణిక్యరెడ్డి, ఉపాధ్యక్షుడు పాపయ్య, సొసైటీ చైర్మన్లు కనకరాజు, సదానందం గౌడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కామిని శ్రీనివాస్, సర్పంచ్‌లు జీవిత బాబు, మహేందర్, చంద్రకళ రవి, ఎంపీటీసీ దుర్గారెడ్డి, నాయకులు రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

పండగ సాయన్న చిరస్మరణీయుడు



సాయన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పండగ సాయన్న చిరస్మరణీయుడని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుపాకుల బాల్ రంగం కొనియాడారు. శనివారం జిల్లాకేంద్రంలో ముదిరాజ్ ఫంక్షన్ హాలులో పండుగ సాయన్న 135వ జయంతి నిర్వహించారు. తొలుత సాయన్న చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం బాల్ రంగం మాట్లాడుతూ పీడిత అణగారిన వర్గాలకు అండగా ఉన్న గొప్ప వ్యక్తి సాయన్న అన్నారు. ఆయన జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకుడు మల్యాల కిషన్, చిన్నకోడూరు మండల అధ్యక్షులు మేడికాయల వెంకటేశం, సిద్దిపేట పట్టణ సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శి మిద్దె రవి తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేటకమాన్: పట్టణంలో పండగ సాయన్న 135వ జయంతిని పట్టణ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో జరిపారు. సాయన్న నేటికీ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని బాల్‌రంగం అన్నారు.

రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి

ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి



మరమ్మతు పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి

చేర్యాల(సిద్దిపేట): ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను వెంటనే మరమ్మతులు చేసి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి సూచించారు. శనివారం మండల పరిధిలోని రాంపూర్‌లో వర్షానికి దెబ్బతిన్న రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్రంలో హరితహారం వల్ల వర్షాలు విరివిగా కురిశాయన్నారు. వర్షాలకు పలు చోట్ల రోడ్లు దెబ్బతిన్నాయన్నారు. దెబ్బతిన్న రోడ్లకు వెంట వెంటనే మరమ్మతులు చేయాలని సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులకు సూచించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్, సర్పంచ్ తివారి దినేష్, మార్కెట్ డైరెక్టర్ తాటికొండ సదానందం, నాయకులు శివల్ల రాజయ్య, అరిగే కనకయ్య, బండారి కనకయ్య, శెట్టి ఓజయ్య తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

రాయపోలు(దుబ్బాక): ఇటీవల వర్షాలకు దెబ్బతిన్న రోడ్ల మరమ్మతుకు చర్యలు తీసుకోవాలని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావును బీజేపీ రాయపోలు మండల నాయకులు కోరారు. స్థానిక మండల శాఖ అధ్యక్షుడు మాదాసు వెంకట్‌గౌడ్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మంకిడి స్వామి తదితరులు శనివారం ఎమ్మెల్యేను కలిసి విన్నవించారు. అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే పర్యటిస్తానన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మన ఇంటితోపాటుగా, పరిసరాలను పరిశుభ్రంగా పెట్టుకుందామని మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు పిలుపునిచ్చారు. శనివారం 42వ వార్డులో నడుస్తూ చెత్తను ఏరుదాంలో రాజనర్సు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గృహిణులకు తడి, పొడి, హానికర చెత్తపై అవగహన కల్పించారు.



అవగాహన కల్పిస్తున్న రాజనర్సు

యువతకు స్ఫూర్తి సినారె



సినారె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న కవులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): యువతకు సింగిరెడ్డి నారాయణ రెడ్డి (సినారె) స్ఫూర్తి ప్రదాత అని ప్రముఖ బాలసాహితీవేత్త ఉండ్రాళ్ల రాజేశం అన్నారు. సినారె జయంతిని సిద్దిపేటలో జాతీయ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత సినారె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఉండ్రాళ్ల రాజేశం మాట్లాడుతూ, సినారె తెలుగు సాహిత్యంలో చెదరని ముద్ర వేసి, సాహితీ సంపద సృష్టించారన్నారు. జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీత డాక్టర్ సి.నారాయణరెడ్డి చిరస్మరణీయులని, తెలుగు సాహిత్యంలో ఆయన రచనలు అమోఘమన్నారు.

తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన మహనీయుడు సింగిరెడ్డి నారాయణరెడ్డి (సినారె) అని వెన్నెల సాహితీ సంగమం అధ్యక్షుడు వంగ నరసింహారెడ్డి కొనియాడారు. శనివారం జిల్లా కేంద్రంలో సినారె జయంతిని వెన్నెల సాహితీ సంగమం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ, తెలుగు సాహిత్య ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిన గొప్ప సాహితీవేత్త, జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత డాక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు.

అంకిత భావంతో పని చేయాలి



ఉద్యోగులకు అవార్డులు అందజేస్తున్న డీఎం వెంకటేశ్వర్లు

డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు

హుస్నాబాద్: ఆర్టీసీ సంస్థ అభివృద్ధి కోసం ఉద్యోగులు అంకితభావంతో పని చేయాలని డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం పట్టణంలోని డిపోలో ఉద్యోగుల ప్రగతి రథ చక్ర నెలవారీ అవార్డులు ప్రదానం, ఆపై అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆర్టీసీ సంస్థ అభివృద్ధి కోసం విధి నిర్వహణలో నిమగ్నమై ఉత్తమ ఫలితాలు తీసుకొచ్చి మిగతా ఉద్యోగులకు స్ఫూర్తిదాయకంగా నిలవడం అభినందనీయమన్నారు. ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు, క్యాష్ అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో ఆఫీస్ సూపరింటెండెంట్ శ్రీధర్, ట్రాఫిక్ ఇన్‌చార్జి నరసయ్య, ఏఎంఎఫ్ సామ్యుల్, ఉద్యోగులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం



మొక్కులు చెల్లించుకుంటున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి

మొహర్రం పండగను ముస్లిం సోదరులు శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. గ్రామాల్లో పీర్లను ఊరేగించారు. వాటిని తిలకించేందుకు భక్తులు ఆసక్తి చూపారు. కార్యక్రమంలో ప్రముఖులు, పీర్ల నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు. మద్దూరులోని నర్సాయపల్లిలో ఉన్న పీర్లకు జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి మొక్కులు చెల్లించుకున్నారు. సాక్షి, నెట్‌వర్క్



బెజ్జంకి(సిద్దిపేట): పీర్లను ఎత్తుకున్న మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

సంక్షిప్త వార్తలు

◆ ఆర్థిక సాయం

మద్దూరు(హుస్నాబాద్): దూల్మిట్ట మండలంలోని బెక్కల్, బైరాన్‌పల్లిలకు చెందిన వడ్లూరి రాజలింగం, నందనబోయిన శ్రీహరిలు మరణించగా వారి కుటుంబాలను బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నాగపూరి కిరణ్‌కుమార్ పరామర్శించారు. అనంతరం బాధిత కుటుంబాలైన వడ్లూరి రాజలింగం కుటుంబానికి రూ.6వేలు, శ్రీహరి కుటుంబానికి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు.

చేర్యాల(సిద్దిపేట): బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నాగపూరి కిరణ్‌కుమార్, బాధిత కుటుంబంలోని మృతుడి భార్య లక్ష్మికి రూ.10వేల ఆర్థికసాయం శనివారం అందించారు. మండలంలోని చిట్యాలకు చెందిన పర్వతం ఉప్పలయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందడం తెలిసిందే.

గుర్జకుంటకు గర్నెపల్లి బాల్‌లక్ష్మికి సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.40 వేల చెక్కును బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నాగపూరి కిరణ్‌కుమార్ చేతుల మీదుగా బాధితురాలికి అందజేశారు.

◆ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

హుస్నాబాద్: ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డాక్టర్స్ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సీమ శ్రీనివాసరావు, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల చంద్రమౌళి కోరారు. హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్‌లో ఆగస్టు 20న తెలంగాణ ఉద్యమకారుల ఆత్మ గౌరవ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. శనివారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఆత్మగౌరవ పోస్టర్ ఆవిష్కరించారు.

◆ గుడాటిపల్లిని గ్రామపంచాయతీ చేయాలి

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని గుడాటిపల్లి పేరుతో నందారం స్టేజీ వద్ద ఏర్పాటు కానున్న కాలనీను కలుపుతూ గ్రామపంచాయతీ ఏర్పాటు చేయాలని సర్పంచ్ బద్దం రాజిరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నందారం స్టేజి వద్ద 5 గిరిజన తండాలు.. 180 కుటుంబాలకు ప్రభుత్వ మోడల్ కాలనీ నిర్మాణం కొనసాగుతోందన్నారు.

◆ ఇన్‌స్పెక్టర్ మహేందర్‌కు సన్మానం

దుబ్బాక: సీఐగా పదోన్నతి పొంది బదిలీపై వెళ్తున్న బత్తుల మహేందర్‌కు దుబ్బాక సీఐ మున్నూరు కృష్ణ, ఎస్‌ఐ గంగరాజు, సిబ్బంది శనివారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా శాలువా కప్పి సన్మానించారు. దుబ్బాక ఎస్‌ఐగా మహేందర్ అందించిన సేవలను వారు కొనియాడారు.

◆ రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి

రాయపోలు(దుబ్బాక): నూతన పట్టాదారు పాస్‌పుస్తకాలు పొందిన రైతులు వెంటనే రైతు బీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని దౌల్తాబాద్ వ్యవసాయ విస్తరణాధికారి అంబటి రాజుగౌడ్ సూచించారు. మండలంలోని ఉప్పర్‌పల్లిలో శనివారం రైతులకు అవగాహన కల్పించారు.

◆ శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలి

మిరుదొడ్డి(దుబ్బాక): శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ సహకరించాలని ఎస్‌ఐ వై. నరేష్ కోరారు. శనివారం మిరుదొడ్డి పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ, ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో వాగులు, చెరువులు పొంగిపొర్లుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎస్‌ఐ నరేష్‌ను ప్రజాప్రతినిధులు శాలువాతో సన్మానించారు.

◆ నిరుపేదలకు సీఎం సహాయ నిధి అండ

మిరుదొడ్డి(దుబ్బాక): నిరుపేదలకు సీఎం సహాయ నిధి అండగా నిలుస్తోందని దుబ్బాక ఆత్మ కమిటీ చైర్మన్ నమిలె భాస్కరాచారి అన్నారు. మండలపరిధిలోని అల్వాల, లింగుపల్లిల్లో అర్హులకు శనివారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందించారు.

◆ బాధితులకు ఆర్థిక సాయం

తొగుట(దుబ్బాక): మండలంలోని వెంకట్రావుపేటకు చెందిన మద్ది స్వామి అనారోగ్యంతో శనివారం మరణించగా బాధిత కుటుంబానికి రూ. 5 వేలు, అలాగే ఇటీవల ఘనపురంలో మరుపల్లి భైరాగౌడ్ చనిపోగా ఆయన కుటుంబానికీ రూ.5 వేల ఆర్థిక సాయాన్ని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాంరెడ్డి, ఎంపీటీసీ నర్సింలు అందించారు.

◆ సమస్యలు పరిష్కరించాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని 9వ వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. శనివారం 9వ వార్డులో పర్యటించారు.

◆ చెక్కుల అందజేత

మర్కూక్(గజ్వేల్): మండలంలోని పాములపర్తికి చెందిన ఉప్పరి గణేష్‌కు రూ.50 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును శనివారం ఎంపీపీ పాండుగౌడ్, జెడ్పీటీసీ మంగమ్మరాంచంద్రం, వైఎస్ ఎంపీపీ బాల్‌రెడ్డి అందించారు.

◆ కొండపాకలో..

కొండపాక(గజ్వేల్): సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరంలాంటిదని గ్రేటర్ హైదరాబాద్ జాగృతీ అధ్యక్షుడు అనంతుల ప్రశాంత్ పేర్కొన్నారు. కొండపాకలో ఆరుట్ల ఎల్లవ్వ, మంతూరి స్వామీ, బండారు కనకయ్య, బండారు రామయ్యకు రూ. 1.70 లక్షల చెక్కులు శనివారం అందజేశారు.